క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

• డీఎంహెచ్ఓ జీవనరాణి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జీవనరాణి

మెరకముడిదాం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.జీవనరాణి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అజిత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల లిస్టులను పరిశీలించండి

• స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.ప్రమీలా గాంధీ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.ప్రమీలా గాంధీ

గజపతినగరం: బీఎల్‌ఓల పరిధిలో ఉన్న అన్ని ఓటర్ల లిస్టులను పారదర్శకంగా పరిశీలించి, అభ్యంతరాలను తెలియజేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి. ప్రమీలాగాంధీ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల లిస్టుల్లో తప్పొప్పుల సవరణ, చేరికలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎలక్షన్ డీటీ వెంకటలక్ష్మి, అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలు పాల్గొన్నారు.

గాన గంధర్వుడికి నివాళులు..



ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహానికి పూల మాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, వాకాడ గోపి, తదితరులు

గుర్ల (గరివిడి): గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా గరివిడి పట్టణంలోని ఉన్న ఆయన విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఎస్‌ఎంఎస్ ఫెర్రో యూనిట్ హెడ్ వాకాడ గోపి పూల మాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. తన గొంతుతో ఎన్నో మధుర గీతాలు పాడి అందరి హృదయాల్లో ఉత్తమ గాయకుడిగా నిలిచిన వ్యక్తి బాలసుబ్రహ్మణ్యమని కొనియాడారు. కార్యక్రమంలో గరివిడి పట్టణ ఎంపీటీసీ సభ్యుడు వలిరెడ్డి లక్ష్మణ, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను ఉన్నారు.

65 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దే రేషన్

• ఆర్డీఓ ఆశయ్య

గుర్ల (గరివిడి): రేషన్ లబ్ధిదారులకు డిపోల్లో సక్రమంగా సరుకులు అందించడంతో పాటు 65 ఏళ్ల వయసు దాటిన వారికి ఇళ్ల వద్దే రేషన్ అందించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య ఆదేశించారు. గరివిడి పట్టణంలోని రేషన్ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్డుదారులతో మాట్లాడుతూ.. సరుకులు సక్రమంగా ఇస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లకు హెచ్చరించారు. కార్యక్రమంలో గరివిడి తహసీల్దార్ చింతా బంగార్రాజు, సీఎస్‌డీటీ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై సమీక్ష

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్ర, ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో 70 మందికి టీఓటీ యోగాసనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 7 నుంచి 14 వరకు గ్రామాల్లో యోగాంధ్రపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించాలన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాములమ్మ, ఎంఈఓ బాలభాస్కరరావు, ఈసీ జోగారావు, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పుణ్య తిరుమలగిరిపై ప్రత్యేక పూజలు

శృంగవరపుకోట: పుణ్య తిరుమలగిరిపై వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి బుధవారం అంకురార్పణ జరిగింది. ఉదయం నుంచి రుత్విక్కుల వేద మంత్రోచ్చారణలతో పుణ్యతిరుమల వేదఘోషతో రంజిల్లింది. ఉదయం ప్రబంధ సేవాకాలంతో స్వామికి భాలభోగం నివేదించిన తర్వాత శాంతిపాఠం, అరణిమధనం చేసి అగ్నిప్రతిష్టతో యాగశాల ప్రవేశం చేయించారు. మూలమంత్ర, మూర్తి మంత్ర హవనాలు చేశారు.



చీపురుపల్లి మెయిన్‌రోడ్డులో వెన్నుపోటు దినం ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బస్టాండ్ రోడ్డు వద్ద జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కూటమి హయాంలో అంతా మోసం.. మాయ..

- ఏడాది పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేదు
- మేనిఫెస్టో అంటే చంద్రబాబుకు లెక్కే లేదు..
- ప్రభుత్వం తీరును నిరసిస్తూ చేపట్టిన 'వెన్నుపోటు దినం' విజయవంతం
- శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు మాయ, మోసం, వంచన తప్ప ఏమీ ఒనగూరలేదని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చి మేనిఫేస్టోలో కూడా పొందుపరిచారని చెప్పారు. కాని ఏడాది కావస్తున్నప్పటికీ అందులో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. మేనిఫేస్టో అంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లెక్క లేదన్నారు. అదే మేనిఫేస్టోను మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి భగవద్గీతలా భావించి ప్రతి ఒక్క హామీని నెరవేర్చారని తెలిపారు. జూన్ 4 నాటికి ప్రజలకు హామీల వెన్నుపోటు పొడిచి ఏడాది కావస్తుండడంతో వెన్నుపోటు దినంగా నామకరణం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.

ధృతరాష్ట్ర పాలన.. రెడ్‌బుక్ రాజ్యాంగం..

కూటమి ప్రభుత్వంలో ధృతరాష్ట్రుని పరిపాలన, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసున్నప్పటికీ రాష్ట్రంలో జరుగుతున్న రెడ్‌బుక్ పరిపాలనను మాత్రం బీజేపీ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పుణ్యమాని ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ మిత్రపక్షంగా ఉన్న బీజేపీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ పేరు చెప్పి చక్కగా మోసం చేశారన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజ్, ఎయిర్‌పోర్టులు జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైనవేనని చెప్పారు.

భారీ ర్యాలీ..

నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లిలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. పట్టణంలోని ఆంజనేయపురంలోని పెట్రోల్ బంక్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్ మీదుగా మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ కార్యకర్తలు హోరెత్తించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన దాదాపు 5 వేల మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్.రాజారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, గుడివాడ శ్రీరాములు, పొన్నాడ కుమార్, బమ్మిడి కార్తీక్, యలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, ఎస్‌వీ రమణరాజు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసప్పలనాయుడు, శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్..



గజపతినగరంలో వెన్నుపోటు దినం ర్యాలీ

- ఏడాదైనా అమలుకాని సూపర్‌సిక్స్ పథకాలు
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని గజపతినగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ నాలుగురోడ్ల కూడలి మీదుగా కల్యాణ వేంకటేశ్వర ఆలయం మీద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు తమ నిరసన గళం వినిపించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకిస్తే నిరుద్యోగులకు 20 వేల ఉద్యోగాలు.. అలాగే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తానన్న చంద్రబాబు హామీ నేడు ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల పెట్టుబడి సాయం ఇంతవరకు రైతులకు అందలేదని చెప్పారు. అలాగే తల్లికి వందనం కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. మహిళలకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజలను చంద్రబాబు మోసం చేశాడన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన కోసం కళ్లు కాయలు కాసేలా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అనేక మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక మధ్యలోనే చదువులకు స్వస్తి పలికే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏ బకాయిలు, పీఆర్సీ, ఇంటీరియం రిలీఫ్ ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు రూ.20 వేల కోట్ల ఏరియర్స్ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. కరోనా వంటి విపత్కరమైన పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కామధేనువు లాంటి సర్కార్‌ను పోగొట్టుకుని దున్నపోతులాంటి చంద్రబాబు సర్కార్‌ను తెచ్చుకున్నందుకు ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. టీడీపీ నాయకులు లక్షల రూపాయలు దోచేస్తున్నా మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజలకు 'వెన్నుపోటు'



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



హెచ్‌డీటీ మూర్తికి వినతిపత్రం ఇస్తున్న కదుబండి శ్రీనివాసరావు, తదితరులు



ఎస్.కోట దేవీ జంక్షన్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- కడుబండి నేతృత్వంలో ర్యాలీ
- కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

శృంగవరపుకోట: 'నమ్ముకున్న ప్రజల్ని వెన్నుపోటు పొడిచిన బాబూ.. నీకు రాష్ట్రాన్ని ఏలే హక్కు ఉందా.. సీఎం డౌన్‌డౌన్.. వెన్నుపోటుల బాబు డౌన్ డౌన్' అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎస్.కోటలో కదం తొక్కాయి. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో ఆకుల డిపో నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రజలకు మద్దతుగా నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు కదనోత్సాహంతో కదిలారు. ఈ సందర్భంగా కన్వీనర్ కడుబండి స్థానిక దేవీ జంక్షన్‌లో పార్టీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాధిత ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రజల గొంతుకై అన్యాయాలను ఎదురిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల కోసం అవసరమైతే నిలబడతాం... కలబడతాం... పడగొడతాం...అంటూ భరోసా కల్పించారు. ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసిందన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు పొడవటం వెన్నతో నేర్చిన విద్య అన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, లక్ష ఉద్యోగాలు, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర పథకాలు ఏమీ ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మండేఎండలో కథనోత్సాహంతో వచ్చిన నాయకులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి.. నాయకులతో కలిసి హెచ్‌డీటీ మూర్తికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శోభా హైమావతి, వేచలపు చినరామునాయుడు, మోపాడ కుమార్, గొర్లె రవికుమార్, గుమ్మడి సత్యనారాయణ, మమ్ములూరి జగన్నాథం, ఒబ్బిన నాయుడు, వాకాడ రాంబాబు, అల్లు అవినాష్, వాకాడ సతీష్, ఎం.వెంకటలక్ష్మి, ఎస్.అప్పారావు, నీలంశెట్టి గోపమ్మ, గేదెల శ్రీను, దొగ్గ సత్యవంతుడు, షేక్ రహ్మాన్, మూకల కస్తూరితో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి

• కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి రాకోటి రాములు



తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాకోటి రాములు, జి.శ్రీనివాస్, తదితరులు

గజపతినగరం: కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి ఆదుకోవాలని కౌలురైతు సంఘ జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలు రైతులకు అన్నిరకాల సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. అలాగే 2019 చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కింద ఇవ్వాల్సిన 20 వేల రూపాయల సాయాన్ని వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కౌలు రైతులు పంటల అప్పలనాయుడు, ధనాన మార్రయ్య, ఓ.సత్యనారాయణ, బొండా వెంకటరమణ, సన్యాసిరావు, కళావతి పాల్గొన్నారు.

ఈడీ గారు వచ్చారు..వెళ్లారు..

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని అన్ని విభాగాలను సందర్శించారని డీఎం రమేష్ తెలిపారు. అయితే పర్యటన అంతా క్షణాల్లో జరిగిపోవడం విశేషం. ఆయనతో పాటు జిల్లా డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

• జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, తదితరులు

గజపతినగరం: ఎటువంటి ఆధారాలు, పట్టాలు లేకుండా జగనన్న కాలనీల్లో ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల పరిధి రామన్నపేట జగనన్న కాలనీలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గూనాన వెంకటరమణ అనే వ్యక్తి ప్రభుత్వం ద్వారా ఎటువంటి స్థలం గాని, ఇల్లు పొందక పోయినా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. అలాగే అదే గ్రామానికి చెందిన సారిక సూర్యనారాయణ భార్య అరుణకు గత ప్రభుత్వ హయాంలో స్థలం మంజూరైనా, మరింత స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పొట్నూరి సూరినాయుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సీతారామాలయంలో హోమం..



హోమం చేస్తున్న అర్చకులు

బొండపల్లి: బొండపల్లి మండలం బోడసింగిపేటలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయ ప్రారంభోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వేద పండితుడు దేవరకొండ వెంకటకృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు. నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

వేపాడ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి. సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఎం.శింగవరం, బల్లంకి, బానాది, కేఆర్ పేట, కుమ్మపల్లి, నరసన్నపేట, ఎన్‌కేఆర్‌పురం, చినగుడిపాల, పెదగుడిపాల, భర్తవానిపాలెం, రాయుడుపేట, బక్కునాయుడుపేట, నల్లబిల్లి, సంజీవమెట్ట, సంజీవపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విచారణ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉప సర్పంచ్‌ను మార్చాలని వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆర్డీఓ విచారణ చేపడతారని ఈఓపీఆర్డీ వాణిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ఉప సర్పంచ్‌ను మార్చాలని 8 మంది వార్డు సభ్యుల ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. విచారణకు సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

స్థల పరిశీలన..



ఎస్.కోట: స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

శృంగవరపుకోట: ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం కోసం మండలంలో వేర్వేరు ప్రదేశాలను జేసీ సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. ఏ ప్రదేశంలో యోగాంధ్ర సభ నిర్వహించాలో నిర్ణయిస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

గంట్యాడలో..

గంట్యాడ: ఈనెల 19న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం కోసం మండలంలోని తాటిపూడిలో జేసీ సేతుమాధవన్ బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. అనంతరం తాటిపూడిలోని రేషన్ డిపోను సందర్శించారు. పక్కా కొలతల ప్రకారం సరుకులు అందించాలని ఆదేశించారు. షాపులకు రాలేని వారికి ఇళ్ల వద్దే సరుకులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మూర్తి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

బొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై కార్యకర్తలు, ఆయాలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఐసీడీఎస్ పీఓ డి. ఉమాభారతి సూచించారు. మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు, కుళాయి పాయింట్లు పరిశీలించారు. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న బీసీ కాలనీ రోడ్డు



వర్షం నీటితోబీసీ కాలనీ రోడ్డు

వేపాడ: చిన్నపాటి వర్షానికి కూడా మండల కేంద్రంలోని బీసీ కాలనీ రహదారి చెరువును తలపిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బీసీ కాలనీ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో పాదాచారులు సైతం నడవలేని దుస్థితి ఏర్పడింది. వేపాడ – ఆనందపురం రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లే రోడ్డు లోతట్టు కావడంతో పాటు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో నీరు నిలిచిపోతోందని కాలనీకి చెందిన ఎలిశెట్టి సత్యవతి, తదితరులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం



శింగరాయి సచివాలయంలోయోగాసనాలు వేస్తున్న మహిళలు, సిబ్బంది

వేపాడ: ప్రతిరోజూ యోగాసనాలు వేయడం వల్ల మానసిక ఆరోగ్యం కలుగుతుందని యోగా మాస్టర్ ట్రైనీ వివరించారు. శింగరాయి సచివాలయంలో బుధవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని, యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.